సాక్షి
మంచిర్యాల
శనివారం, 1, మార్చి, 2025



ఉపాధి మార్గం

మిరప పంటతో మహారాష్ట్ర కూలీలకు ఉపాధి లభిస్తోంది. అక్కడ పని లభించకపోవడంతో యేటా సీజన్‌లో పని కోసం ఇక్కడికి వలస వస్తూ ఉపాధి పొందుతున్నారు. 8లో▸



విస్తరణకు అడ్డంకులు

మంచిర్యాలలో మాస్టర్‌ప్లాన్ అమలయ్యేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు పనులకు అడ్డుగా ఉన్న వివాదాల పరిష్కారంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /18.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు బలంగా వీస్తాయి.

పది జీపీఏనే ప్రవేశార్హత!

- గురుకుల కళాశాలల్లో అడ్మిషన్లకు అర్హత పరీక్ష రద్దు!
- విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే సీటు కేటాయింపు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీవోఈ) కళాశాలల్లో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈసారి పోటీ పరీక్ష నిర్వహించే అవకాశాలు లేనట్లు తెలుస్తోంది. పదో తరగతిలో విద్యార్థి సాధించిన మార్కుల ప్రాతిపదికన సీటు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. 10జీపీఏ/మెరిట్ సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే నేరుగా ప్రవేశం కల్పించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు సమాచారం. సాధారణ గురుకుల కళాశాలల విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణత సాధిస్తే చాలు జీపీఏతో సంబంధం లేకుండా నేరుగా ఇంటర్‌లో ప్రవేశం కల్పించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఏటా ప్రథమ సంవత్సరంలో పూర్తి స్థాయిలో సీట్లు భర్తీ కాకపోవడంతో గురుకుల విద్యాసంస్థలు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే ప్రతీ ఏడాది డిసెంబర్, జనవరిలో సీవోఈల్లో, సాధారణ గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి విడుదల చేసే నోటిఫికేషన్ ఇప్పటివరకు రాలేదు.

గిరిజన గురుకులాల్లో సీవోఈ వ్యవస్థ

మరోవైపు గిరిజన సంక్షేమ గురుకులంలో ఈసారి కొత్తగా సీవోఈ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రవేశ పరీక్ష ఆధారంగా ఇంటర్‌లో అడ్మిషన్ కల్పించడానికి ఇటీవల అర్హత పరీక్ష నిర్వహించారు. ఫలితాలు వెలువడాల్సి ఉంది. సంక్షేమ గురుకుల విద్యాలయంలోని సీవోఈ వ్యవస్థను ఆదర్శంగా తీసుకుని కొత్తగా గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ సీవోఈలను ఏర్పాటు చేసి ముందుకు సాగుతుండగా.. అంకురార్పణ చేసిన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ తిరోగమన దిశలో అడుగులు వేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. పదో తరగతి ఫలితాలు వెలువడితే గానీ గురుకుల సాధారణ కళాశాలల్లో, సీవోఈల్లో విద్యార్థులకు ఏ ప్రాతిపదికన ప్రవేశం కల్పిస్తారనేది తెలదు.

సాధారణ గురుకులాల్లో..

సీవోఈయేతర బీసీ, ఎస్సీ సాధారణ గురుకులాల్లో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి తాజా నిర్ణయంతో ప్రవేశ పరీక్ష రాయాల్సిన అవసరం లేకుండా పోయింది. గురుకులాల్లోని విద్యార్థులు 'పది'లో ఉత్తీర్ణత సాధించి దరఖాస్తు చేసుకుంటే చాలు సీటు కేటాయించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. 2025–26 విద్యాసంవత్సరం నుంచి ఈ విధానం అమలుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం వల్ల ఇతర పాఠశాలల విద్యార్థులు గురుకులాల్లో చదివే అవకాశాలు అంతంత మాత్రమే ఉంటాయని అంటున్నారు. ప్రస్తుతం గురుకులాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోకపోతే మిగిలిన సీట్ల భర్తీకి మాత్రమే గురుకులేతర విద్యార్థులకు అడ్మిషన్ కలిపించే అవకాశాలు ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.

రద్దు సరైనదేనా..?

ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ మార్కుల ఆధారంగా గురుకుల విద్యాలయాల్లో అడ్మిషన్లు కల్పించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతిభావంతులైన విద్యార్థులకు మాత్రమే సీటు దక్కుతోంది. దీంతో ఏటా పూర్తి స్థాయిలో సీట్లు భర్తీ కాకుండా మిగులుతున్నాయి. సీట్ల భర్తీ లక్ష్యంగా అర్హత పరీక్షను రద్దు చేయడం సరైన నిర్ణయం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీవోఈల వన్నె తగ్గే అవకాశాలు ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాలు 27 ఉన్నాయి.



బెల్లంపల్లి సీవోఈ గురుకుల కళాశాల ముఖద్వారం

ఉమ్మడి జిల్లాలో రెండు సీవోఈలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలో రెండు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీవోఈ) కళాశాలలు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బాలికలు, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో బాలుర గురుకుల కళాశాలలు ఉన్నాయి. ఒక్కో కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ఉన్నాయి. ఒక్కో సెక్షన్‌లో 40 మంది చొప్పున విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తుంటారు. ఈ లెక్కన ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 80 మందికి ప్రవేశం కల్పిస్తారు. కాగా పెద్దపల్లి జోనల్ పరిధి(నిర్మల్ జిల్లా మినహాయింపు)లో ఉమ్మడి జిల్లాలో 15 సాధారణ సంక్షేమ గురుకుల కళాశాలలు ఉన్నాయి.

అధికారులు పునరాలోచించాలి



గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి అర్హత పరీక్ష నిర్వహించి మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు మాత్రమే అడ్మిషన్ కల్పిస్తున్నారు. ఈ తీరుగా వ్యవహరించడం వల్ల ప్రతిభావంతులకు ప్రవేశం దక్కుతుంది. ఈసారి అర్హత పరీక్ష లేకుండా దరఖాస్తు చేసుకుంటే చాలు సాధారణ గురుకులాల్లో, 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు సీవోఈల్లో అడ్మిషన్ కల్పించాలని నిర్ణయించడం సరైన విధానం కాదు. ఉన్నతాధికారులు పునరాలోచన చేయాలి. పోటీ పరీక్ష నిర్వహించి అడ్మిషన్ కల్పించడం అన్ని విధాలా శ్రేయస్కరం.

– పెరుగు తిరుపతి, పేరెంట్

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ కుమార్‌దీపక్

నస్పూర్: మార్చి 5 నుంచి 25వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం ఆమె ఇంటర్‌బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణపై హైదరాబాద్ నుంచి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, మూత్రశాలలు, ఫ్యాన్లు ఇతర ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాల తరలింపునకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి క్రమబద్ధీకరణ వేగవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ దీపక్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 4,965 మంది జనరల్, 935 మంది ఒకేషనల్, ద్వితీయ సంవత్సరంలో 5,625 మంది జనరల్, 1,015 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని వివరించారు. అనంతరం ఆయన పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు, రేపు బర్డ్ ఫెస్టివల్

జన్నారం: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని కలెక్టరేట్ ఆవరణలో శని, ఆదివారాల్లో కవ్వాల్ బర్డ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జన్నారం రేంజ్ అధికారి సుష్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లో కనిపించే వివిధ రకాల పక్షులు, వాటి వివరాలు, జీవ వైవిధ్యంలో వాటి పాత్రపై వివరిస్తారని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల పక్షి ప్రేమికులు, పక్షుల అధ్యయనం చేసేవారు, ఎన్జీవోలు, జిల్లా అటవీ అధికారులు హాజరవుతారని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు పక్షులు, వన్యప్రాణులు, జీవ వైవిధ్యం, అడవుల ప్రయోజనాలను అవగాహన కల్పిస్తారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

'కత్తెరసాల' జాతర ఆదాయం రూ.18.29లక్షలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామంలో మల్లికార్జునస్వామి ఆలయంలో మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని మూడు రోజులపాటు నిర్వహించిన జాతర ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. ఆలయ ఆవరణలో లెక్కింపు చేపట్టగా రూ.18.29 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ముక్త రవి తెలిపారు. గత ఏడాది కంటే రూ.1.61లక్షలు ఎక్కువగా వచ్చింది. హుండీ ద్వారా రూ.7,78,721, బహిరంగ వేలం ద్వారా రూ.4.28లక్షలు, పట్నం రసీదుల ద్వారా రూ.2,69,800, ప్రత్యేక దర్శనం రసీదుల ద్వారా రూ.2లక్షలు, సులభ దర్శనం, కొబ్బరి ముక్కలు, తైబజార్ ద్వారా ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకులు రంగు రవి, కిషన్, ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తల మండలి, దేవాదాయ శాఖ సిబ్బంది సతీష్, పరమేశ్, గోపీ, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

హౌసింగ్ సొసైటీలో వసతులు కల్పించాలి



సమావేశంలో టీఎన్జీవో జిల్లా నాయకులు

పాతమంచిర్యాల: టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ లోని ఫేజ్–1, 2లో మౌలిక వసతులు కల్పించాలని టీఎన్జీవో జిల్లా సర్వసభ్య సమావేశం తీర్మానించింది. శుక్రవారం మంచిర్యాలలో టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఫేజ్–3లో ఉన్న టవర్‌ను తొలగించి వేరే చోట ఏర్పాటు చేయాలని, అర్హులైన వారికి ప్లాట్లు కేటాయించాలని, పొజిషన్ రాని వారికి ఫేజ్–3లో కోర్టు కేసుల తర్వాత పంపిణీ చేయాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.మొండయ్య, కార్యదర్శి మహ్మద్ హబీబ్ హుస్సేన్, సంయుక్త కార్యదర్శి భూముల రాంమ్మోహన్, కోశాధికారి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

నాల్గోతరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅర్బన్: గిరిజన సంక్షేమ శాఖ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం డీటీడీవో అంబాజీకి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల డెయిలివేజ్, పార్ట్‌టైం, శానిటేషన్ సిబ్బంది బకాయి వేతనాలు తదితర సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కేబీసీ నారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు దిలీప్, ప్రధాన కార్యదర్శి స్వాతి, ఉపాధ్యక్షులు భీమయ్య, రాజేందర్, కోశాధికారి సంతోష్, కార్యదర్శులు వినోద్, సత్తమ్మ, మహిళా కార్యదర్శి చంద్రకళ, సంయుక్త కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా కార్యాలయ కార్యదర్శి శోభన్ పాల్గొన్నారు.

జోరుగా 'ఉపాధి' పనులు

- పని దినాల లక్ష్యం 30.5లక్షల రోజులు
- ఇప్పటికే పూర్తయినవి 28లక్షలు..



ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు

జిల్లాలో పనుల వివరాలు

పనిపేరు:	మంజూరు	జరుగుతున్నవి
పశువుల పాకలు	258	225
ఇంకుడు గుంతలు	275	251
రోడ్డు పనులు	65	19
నర్సరీల పెంపకం	310	310
పౌల్ట్రీ షెడ్‌లు	17	17
సిమెంట్ రోడ్లు	294	131
జీపీ భవనాలు	15	6
అంగన్‌వాడీ కేంద్రాలు	18	1
భూమి అభివృద్ధి పనులు	117	88
పశుగ్రాసం పెంపకం పనులు	215	142
వర్మీకంపోస్టు షెడ్‌లు	220	167
ఉద్యాన వన తోటలు	67	50
రాతికట్టల పనులు	36	16
చెక్‌డ్యాంలు	17	5
ఫారంపాండ్‌లు	82	26
ఊట కుంటలు	91	34
రూఫ్‌డ్రెయిన్ వాటర్‌స్ట్రక్చర్స్	66	35
బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్‌లు	27	12
సేద్యపు బావులు	12	3
పాఠశాలల ప్రహరీలు	161	63

పాతమంచిర్యాల: జిల్లాలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన వివిధ రకాల పనులు జోరుగా సాగుతున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 30.5లక్షల పని దినాలు లక్ష్యంగా వార్షిక ప్రణాళికను అధికారులు రూపొందించారు. ఏప్రిల్ 2024 నుంచి చేపట్టిన పనులు ఈ ఏడాది మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉంది. జిల్లాలో పశువుల పాకలు, పౌల్ట్రీషెడ్లు, రోడ్డు పనులు, ఇంకుడు గుంతల తవ్వకాలు, నర్సరీల పెంపకం, సిమెంటు రోడ్లు, భూ అభివృద్ధి, పశుగ్రాసం పెంపకం పనులు, వర్మీకంపోస్టు పిట్‌లు, ఉద్యానవన తోటల పెంపకం, రాతికట్టలు, చెక్‌డ్యాంల నిర్మాణం, ఫారంపాండ్‌లు, ఊటకుంటలు, సేద్యపు బావులు, పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం చేపట్టారు. ఈ పనులకు మెటీరియల్ కాంపోనెంటు కింద రూ.38కోట్లకు గాను రూ.9కోట్లు ఖర్చు చేశారు. మిగతా రూ.29కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. మార్చి నెలాఖరులోగా పనులు పూర్తి చేయడానికి అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయడానికి క్షేత్రస్థాయిలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రతీ గ్రామ పంచాయతీలో 50మందికి తగ్గకుండా ఉపాధి హామీ పథకం కూలీలకు పని కల్పిస్తున్నారు. వంద రోజులు పని దినాలు నిండని కూలీలకు కచ్చితంగా పని కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు. కూలీల హాజరు శాతం పెంచుతూ లక్ష్యాన్ని అధిగవించేలా పనులు నిర్వహిస్తామని డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

స్థలం కరువై..

జిల్లాలోని పలు చోట్ల అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కరువైంది. భవనాల నిర్మాణానికి రూ.10లక్షల కంటే ఎక్కువ వ్యయం అవుతుండడంతో స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఏజెన్సీలు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. 18అంగన్‌వాడీ కేంద్రాలకు ఒకటి నిర్మాణంలో ఉండగా.. గ్రామ పంచాయతీ భవనాలు ఆరింటి నిర్మాణాలు కొనసాగుతున్నాయని పంచాయతీ రాజ్ ఏఈ రామ్మోహన్ రావు తెలిపారు.

గడువులోగా పూర్తి చేస్తాం



ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. జాబ్ కార్డు కలిగిన ప్రతీ కూలీకి పని కల్పించి వారికి 100 రోజులు పని దినాలు కల్పించి పూర్తి కూలి పొందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్.కిషన్, డీఆర్డీఓ మంచిర్యాల

విద్యాసంవత్సరానికి సిద్ధంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



పైప్‌లైన్ పనుల వివరాలు ఆరా తీస్తున్న కలెక్టర్

నస్పూర్: వచ్చే విద్యాసంవత్సరం 2025–26 ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం ఆయన నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్‌తో కలిసి గ్రామీణాభివృద్ధి, విద్య, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, వెనుకబడిన తరగతులు, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో కలిసి విద్యార్థులకు ఏకరూప దుస్తులు, అభివృద్ధి పనుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తరగతుల వారీగా విద్యార్థులకు కొలతలు తీసుకుని జిల్లాలో గుర్తించిన 630 స్వయం సహాయక సంఘాల సభ్యుల సమన్వయంతో ఏకరూప దుస్తుల ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల చెల్లింపులు చేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని సంక్షేమ వసతి గృహాల్లో తప్పనిసరిగా నిద్రచేయాలని తెలిపారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

నస్పూర్: రంజాన్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు ప్రకాశ్, వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావులతో కలిసి తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ముస్లిం మతపెద్దలతో రంజాన్ పండుగ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పండుగ నిర్వహణకు సంబంధిత శాఖలు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

పైప్‌లైన్ పనుల పర్యవేక్షణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా హాజీపూర్ మండలం ముల్కల్ల, వేంపల్లి గ్రామాల్లో చేపట్టిన అమృత్ 2.0 పైప్‌లైన్ పనులను కలెక్టర్ కుమార్‌దీపక్ శుక్రవారం పర్యవేక్షించారు. మిషన్ భగీరథ పథకంలో ప్రతీ ఇంటికి కుళాయి ద్వారా శుద్ధమైన తాగునీటిని అందించాలని తెలిపారు. పైప్‌లైన్ లీకేజీలు, నీటిట్యాంకుల మరమ్మతు, పరిశుభ్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి ప్రాంతాలకు మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఇంజినీర్ మధూకర్ పాల్గొన్నారు.

ఎస్‌ఎల్‌బీసీ రెస్క్యూ సేవలకు శ్రీరాంపూర్ ఉద్యోగులు



ఉద్యోగులతో జీఎం ఎం.శ్రీనివాస్

శ్రీరాంపూర్: ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ సేవల్లో పాల్గొనడానికి శ్రీరాంపూర్ నుంచి ఉద్యోగులు శుక్రవారం తరలివెళ్లారు. సీఎండీ యన్.బలరాం నాయక్ ఆదేశాల మేరకు ఇప్పటికే సుమారు 100 మంది రెస్క్యూ టీం అక్కడికి చేరుకుని సేవలందిస్తున్నారు. వీరికి సహాయకులుగా శ్రీరాంపూర్ నుంచి 40 మంది ఉద్యోగులు, సూపర్‌వైజర్, సెక్యూరిటీ గార్డు, సంక్షేమ అధికారి వారి వెంట వెళ్లారు. సీసీసీలోని ఎస్సీఓఏ క్లబ్ వద్ద ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ వారిని కలిసి స్వీయ రక్షణ పాటిస్తూ సహాయక చర్యల్లో పాల్గొనాలని ఉద్యోగులకు సూచించారు. వారందరిని ప్రత్యేక బస్సులో తరలించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్‌కుమార్, చిరంజీవులు, మల్లయ్య, రవీందర్, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి పాల్గొన్నారు.

మల్లన్నా వెళ్లొస్తాం..

- ముగిసిన వేలాల జాతర
- చివరి రోజు మొక్కులు చెల్లించిన భక్తులు



జాతర నుంచి వాహనాల్లో తరలివెళ్తున్న భక్తులు

జైపూర్: మండలంలోని వేలాలలో మూడు రోజుల పాటు సాగిన మల్లన్నస్వామి జాతర శుక్రవారం ముగిసింది. తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తజనం మొక్కులు చెల్లించి తిరుగుముఖం పట్టింది. శుక్రవారం ఉదయం గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి సంప్రదాయ గొల్లపూజారులతో గంగమ్మతల్లికి పట్నాలు వేశారు. ఆయా ప్రాంతాల నుంచి జాతరకు సుమారు నాలుగు లక్షల మంది వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. జాతరలో పోలీసులు కీలక పాత్ర పోషించారు. నెల రోజుల ముందు నుంచే అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ భక్తులకు సౌకర్యాలు, సులభతరంగా దర్శనం, పార్కింగ్, తాగునీటి వసతిపై చర్యలు తీసుకున్నారు. ఫలితంగా వేలాదిగా తరలి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా దర్శించుకుని మొక్కులు తీర్చుకుని వెళ్లారు.

ఆదాయం రూ.62లక్షలు

ఆలయ ఈవో రమేశ్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీధర్ నేతృత్వంలో వాలంటీర్లు శుక్రవారం హుండీలను లెక్కించారు. మొదటి రోజు గుట్టపై ప్రత్యేక దర్శనం ద్వారా రూ.4,61,250, పట్నాల ద్వారా రూ.1,12,400, కేశఖండనం ద్వారా రూ.22,280, హుండీ ద్వారా రూ.12,41,880, మిశ్రమ బంగారం 2మిల్లీగ్రాములు, మిశ్రమ వెండి 975మిల్లీగ్రాములు, గుట్ట కింద రెండో రోజు ఆలయంలో సులభ దర్శనం ద్వారా రూ.5,89,400, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.3,53,650, పట్నాల ద్వారా రూ.3,14,800, కేశఖండనం ద్వారా రూ.8వేలు, మిశ్రమ బంగారం 800మిల్లీగ్రాములు, మిశ్రమ వెండి 475మిల్లీగ్రాములు కాగా గుట్ట మీద కింద మొత్తం ఆదాయం రూ.46,90,265, కొబ్బరికాయల విక్రయం టెండర్, పార్కింగ్, లడ్డుప్రసాదం, బోలీపేలాల విక్రయం టెండర్ల ద్వారా రూ.15.27లక్షలు మొత్తంగా జాతర ఆదాయం రూ.62,17,265 వచ్చింది. గుట్ట కింద ఆలయంలో హుండీ ద్వారా గత ఏడాదితో పోల్చితే రూ.7లక్షలు తగ్గింది.



మల్లికార్జున స్వామి



హుండీలను తరలిస్తున్న సీఐ, ఈవో, ఎస్సై

మహానీయుల సేవలు చిరస్మరణీయం



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

బెల్లంపల్లి: బీఆర్ అంబేడ్కర్, మహాత్మాజ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, పెరియార్ రామస్వామి వంటి మహానీయులు దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రొఫెసర్ బాలబోయిన సుదర్శన్, విజ్ఞాన దర్శిని అధ్యక్షుడు రమేష్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బెల్లంపల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎదుట మహానీయుల విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం సామాజిక కార్యకర్త రంగ ప్రశాంత్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. బీసీ మహిళా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎర్ర సువర్ణ, కవి, రచయిత తోట భూమన్న, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు తోకల రాజేశం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్, సంక్షేమ గురుకుల సీవోఈ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీధర్, హైకోర్టు న్యాయవాది ఉదయ్‌కాంత్, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు సరిత, విజయలక్ష్మీ, విగ్రహాల ప్రతి ష్ఠాపన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీహరి, శ్రీధర్ పాల్గొన్నారు.

ఉపాధి మార్గం

- మిర్చి సేకరణతో 'మహా' కూలీలకు ఉపాధి
- సౌకర్యం కల్పిస్తున్న రైతులు

కోటపల్లి: వ్యవసాయమంటేనే వ్యయప్రయాసలతో కూడుకున్నది. పత్తి, వరి, మిర్చి పంట ఏదైనా సరే కూలీల భాగస్వామ్యం లేనిదే దిగుబడి రైతు చేతికి అందదు. రైతు సాగుచేసిన పంట తనతోపాటు మరో పదిమంది కూలీలకు ఆదరవు ఇస్తుందనడానికి నెలవుగా మారుతుంది మిరప పంట సాగు. కోటపల్లి, వేమనపల్లి సరిహద్దు ప్రాంతాల్లో ఏటా సాగవుతున్న మిరప పంట స్థానికులతోపాటు మహారాష్ట్ర కూలీలకు నాలుగు నెలల పాటు ఉపాధి కల్పిస్తోంది. వందలాది మహారాష్ట్ర కూలీలు మిరప, పత్తితో ఉపాధి పొందుతున్నారు.

ఏటా జోరుగా సాగు..

జిల్లాకు సరిహద్దున ఉన్న కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో ఏటా మిరప సాగు జోరుగా సాగుతోంది. గతేడాది మద్దతు ధర లేక రైతులు నష్టాల పాలైనప్పటికి ప్రత్యామ్నాయం లేక ఈసారి అదే పంటను సాగుచేయక తప్పలేదు. రైతుల కష్టాలను పక్కన పెడితే మిరప పంట అనేక మంది కూలీల కడుపు నింపుతోంది. మిరపను తెంపేందుకు స్థానిక కూలీలు సుముఖత ఉండకపోవడం వల్ల మహారాష్ట్ర కూలీలకు ఆదరవుగా నిలుస్తోంది. సుమారు నాలుగు నెలలపాటు మిరప కోతలతో ఉపాధి పొందేందుకు వందలాది కూలీలు తమ కుటుంబాలతో గ్రామాలను విడిచి వలసవస్తున్నారు. కోటపల్లి, వేమనపల్లి ప్రాణహిత సరిహద్దు గ్రామాల్లో వందలాది ఎకరాల్లో మిరప సాగవుతోంది. మిరపను చెట్ల నుంచి తెంపడం, ఆరబెట్టడం, గ్రేడింగ్ చేయడం బస్తాల్లో నింపడం లారీల్లో ఎక్కించడం తదితర పనులను చేయాల్సి ఉండటంతో ఇక్కడి రైతులు ఎక్కువగా మహారాష్ట్ర కూలీలపై ఆధారపడుతున్నారు. వీరికి భోజనం వసతి ఏర్పాటుతోపాటు రోజుకు రూ.300 చొప్పున కూలీ ఇస్తుండటంతో మిరప తోటల్లో ఎక్కడ చూసిన సరిహద్దు రాష్ట్రానికి చెందిన కూలీల సందడే కనిపిస్తోంది. చిన్నా,పెద్దా తేడా లేకుండా మిరప కోతలు చేపడుతూ కూలీలు తమ పొట్టపోసుకుంటున్నారు. పొరుగు రాష్ట్రాల కూలీలు సుమారు 20 వేల మందికి పైగా వస్తున్నట్లు అంచనా.



మిర్చి తీస్తున్న వలసకూలీలు

ఈ ఏడాది జిల్లాలో సుమారు 5వేల ఎకరాల్లో మిర్చి సాగైంది. రాంపూర్, కొల్లూర్, దేవులవాడ, లక్ష్మీపూర్, రాపన్‌పల్లి, అన్నారం, సిర్సా, పుల్లగామ, జనగామ, అర్జునగుట్టలో సుమారు 2 వేల ఎకరాల్లో పంట సాగైంది. మహారాష్ట్రలోని సిరోంచాతోపాటు జిమ్మలగట్టు, కమలాపూర్, ఒద్దిగాం, ఇర్కపల్లి, మొట్లగూడెం, గుండెరా, రాపన్‌పల్లి, ఒద్దిగాం, సూరయ్యపల్లి, అమరాశి, బామిని, ఇందారం, అబ్బన్‌పల్లి, జింగనూరు, తెకంపల్లి దేవులమర్రి తదితర గ్రామాలకు చెందిన కూలీలు ఇక్కడికి అధికంగా వస్తున్నారు. ప్రస్తుతం ఎలాంటి పనులు లేకపోవడంతో ఇక్కడ మిరప తోటల్లో కూలీ పనులు చేసేందుకు వస్తున్నామని వారు తెలుపుతున్నారు.

వలస కూలీలతో వెసులుబాటు

స్థానిక కూలీల రవాణా ఏర్పాట్లు, సమయ పాలన పాటించకపోవడం తదితర సమస్యలు ఎదురవుతుంది. ఈ నేపథ్యంలో రైతులు మహారాష్ట్ర కూలీలను ఆశ్రయించి వారితో పంట పనులు చేయిస్తున్నారు. వారికి రవాణా ఖర్చు లేకపోవడం, పొలాల్లోనే నివాసం ఏర్పరచుకోవడం ద్వారా కూలీ గిట్టుబాటు కావడం తదితర లబ్ధి చేకూర్చే ప్రయోజనాలు ఉంటున్నాయి.

మా వద్ద పనులు లేక



మా రాష్ట్రంలో పనులు లేక మిర్చి కోతలకు వచ్చాం. మూడేళ్లుగా ఉపాధి కోసం ఇక్కడికే వస్తున్నాం. అక్కడ పనులున్నా డబ్బు తక్కువ ఇస్తారు. అందుకే ఇక్కడకు వచ్చి మిర్చి కోతలు పూర్తయ్యే వరకు ఉంటాం.

– అర్జున్ కౌశిక్, ఛత్తీస్‌గఢ్

మిర్చి కోతలకు వచ్చాం



ఐదేళ్లుగా మిర్చి కోతలకు రాంపూర్‌కు వస్తున్నాం. భార్యబిడ్డలతో మమ్మల్ని ఇక్కడి రైతులు బాగానే చూసుకుంటున్నారు. కుటుంబాలతో మూడు, నాలుగు నెలలు ఉండి కోతలు పూర్తయ్యాక వెళ్లిపోతాం.

– అత్మారామ్, రంగయ్యపల్లి, మహారాష్ట్ర

కూలీలకు సౌకర్యాలు



ఈ ఏడాది మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 50 మంది కూలీలు వచ్చారు. మిర్చి కోసేందుకు వచ్చిన వారికి కిలో రూ.12 చొప్పున ఇస్తూనే ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఈ ఏడాది మిర్చి దిగుబడి తగ్గడమే కాక మార్కెట్‌లో ధర లేకపోవడం బాధగా ఉంది.

– కిష్టయ్య, రైతు, ఆలుగామ

వలస కూలీలపై ఆధారం



కూలీల కొరతతో వలస కూలీలపై ఆధారపడుతున్నాం. పొలాల్లో కూలీలకు కరెంట్, నీటి సౌకర్యం, బియ్యం, సరుకులు సమకూరుస్తున్నాం. ఈ ఏడాది ఆరు ఎకరాల విస్తీర్ణంలో మిర్చి సాగు చేయగా కూలీలతో కోయిస్తున్నా.

– చంద్రశేఖర్, రాంపూర్, రైతు

క్లుప్తంగా

ఇసుక అక్రమ నిల్వల గుర్తింపు



ఇసుక నిల్వల వద్ద పోలీసులు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం పులిమడుగు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను శుక్రవారం పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో తనిఖీ చేపట్టగా సుమారు 40 ట్రాక్టర్ల ఇసుక లభ్యమైంది. ఈమేరకు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించి ఇసుక నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే ట్రాక్టర్లు జప్తు

జన్నారం: ఇసుక రవాణాకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అనుమతి ఉందని, రాత్రివేళల్లో చేస్తే ట్రాక్టర్లను జప్తు చేస్తామని ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేసిన ట్రాక్టర్లకు ఇదివరకు జరిమానా విధించి వదిలేశామని, అయినా కొందరు ఇసుక తలిస్తున్నారని తెలిపారు. ఇంటి నిర్మాణాలు, ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసమే ఇసుకను అనుమతి ఉందన్నారు. అక్రమ కలప రవాణా చేస్తే చర్యలు ఉంటాయన్నారు. ఇందనపెల్లి రేంజ్ పరిధిలో అటవీ ఆంక్షలు విధించామని, ఎవరైన అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక లారీ బోల్తా

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ సమీపంలో శుక్రవారం ప్రమాదవశాత్తు ఇసుకలారీ బోల్తాపడింది. ఈ ఘటనతో ప్రమాదం తప్పింది. ఏఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాలు.. మంచిర్యాల నుంచి భైంసాకు లారీ ఇసుకలోడ్‌తో వస్తుంది. జాతీయ రహదారిపై ఒక్కసారి అదుపుతప్పి బోల్తాపడింది. కొద్ది దూరంలో భైంసా నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న వాహనాలు నిలిపివేశారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ అశిష్‌యాదవ్‌కు స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని లారీని పక్కకు తీసి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఆరునెలల జైలు

మంచిర్యాలక్రైం: చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఆరునెలల సాధారణ జైలుశిక్షతోపాటు తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కె.నిరోష శుక్రవారం తీర్పుచెప్పారు. మంచిర్యాల అశోక్‌రోడ్‌కు చెందిన పూదారి రమేశ్ వద్ద ఏసీసీ సుభాష్‌నగర్‌కు చెందిన నామిని రమేశ్ సొంత అవసరం నిమిత్తం రూ.4.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ష్యూరిటీ కింద చెక్కులు అందించాడు. అప్పు ఇచ్చిన గడువు దాటాక పూదారి రమేశ్ బ్యాంకులో చెక్కులు డిపాజిట్ చేయగా బౌన్స్ అయ్యాయి. బాధితుడు 2017లో కోర్టును ఆశ్రయించాడు. ఇరువురి వాదనలు అనంతరం నేరం రుజువు కావడంతో నామిని రమేశ్‌కు ఆరునెలల జైలుశిక్షతోపాటు తీసుకున్న అప్పు చెల్లించాలని మేజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు.

ఆర్జీయూకేటీలో జాతీయ సైన్స్ దినోత్సవం



నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, తదితరులు

బాసర: ఆర్జీయూకేటీలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైన్స్ ప్రాధాన్యతను విద్యార్థులు ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. తర్వాత విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ.మురళీదర్శన్, ఏవో శ్రీరణధీర్ సాగి, అసోసియేట్ డీన్ డాక్టర్ విఠల్, డాక్టర్ చంద్రశేఖర్, మహేశ్, హెచ్‌ఓడీలు దేవరాజు, సాయికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన కుస్తీపోటీలు



తలపడుతున్న మల్లయోధులు

కుంటాల: మహాశివరాత్రి పురస్కరించుకుని మండలంలోని ఓలా గ్రామంలోని శివాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. ముందుగా ఈ పోటీలను మాజీమంత్రి ఐకే రెడ్డి పీఏ శ్రీనివాస్ ప్రారంభించారు. తెలంగాణ, మహారాష్ట్ర నుంచి 200 మంది మల్లయోధులు వచ్చి పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన విజేతకు రూ.5వేల నగదుతోపాటు వెండి కడియం, రెండో విజేతకు రూ.3వేల నగదును శ్రీనివాస్ బహూకరించి సన్మానించారు. ఎస్సై సీహెచ్. భాస్కరాచారి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదివాసీ రైతులకు పురస్కారాలు

బెల్లంపల్లి: అనాదిగా వస్తున్న పాత పంటలను సాగు చేస్తున్న బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) పరిధిలోని ఆదివాసీ రైతులకు పురస్కారాలు వరించాయి. శుక్రవారం హైదరాబాద్ వ్యవసాయ సాంకేతికత ప్రయోగ సంస్థ ఆధ్వర్యంలో జహీరాబాద్, సంగారెడ్డి జిల్లాలో పంట రకాలు, రైతుల హక్కుల పరిరక్షణపై రాష్ట్రంలోని కేవీకేలకు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్తలు, పాత పంటలు సాగు చేస్తున్న రైతులు హాజరయ్యారు. బెల్లంపల్లి కేవీకే పరిధిలోని కుమురం భీం జిల్లా తిర్యాణి మండలానికి చెందిన ఆదివాసీ రైతులు ఆత్రం భీంరావు, నైతం రఘులను పీపీవీఎఫ్ఆర్ఏ చైర్మన్ త్రిలోచన మహాపత్ర, అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ మీరా శాలువ కప్పి సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు పంటల సాగు తీరు గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. సీనియర్ శాస్త్రవేత్తలు, బెల్లంపల్లి కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ, పీపీవీఎఫ్ఆర్ఏ సిబ్బంది పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న రైతులు

కీచక హెచ్‌ఎంపై పోక్సో కేసు

భీమిని: మండల కేంద్రంలోని జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాలలో కీచక హెచ్‌ఎంపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న రేగుచెట్ల రమేశ్ 5వ తరగతి బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. బ్యాడ్ టచ్ చేయడంతో బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు హెచ్‌ఎంపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, బాలికలపై ఎక్కడ పడితే అక్కడ చేతులు వేసేవాడని రమేశ్‌పై ఆరోపణలు ఉన్నాయి.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు బలవన్మరణాలకు పాల్పడ్డారు. రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులు తీర్చలేక తండ్రి, భార్యతో గొడవ కారణంగా భర్త ఉరేసుకున్నారు.


రైలు కిందపడి యువకుడు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ జస్పాల్ సింగ్ కథనం ప్రకారం.. మందమర్రికి చెందిన సర్సపూరి వినయ్ (30) సింగరేణిలో కాంట్రాక్ట్ పద్ధతిలో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు భార్య భాగ్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కాగా ఆయన మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చనిపోవడానికి ముందు కారణాలు చెబుతూ సెల్ఫీ వీడియో తీసుకున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపర్చినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. వినయ్ సెల్ఫీ వీడియో బయటకు వస్తే కారణాలు తెలిసే అవకాశం ఉందని కుటుంబీకులు, స్నేహితులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు తీర్చలేక తండ్రి..

తానూరు: కూతుళ్ల పెళ్లిళ్లకు చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపంతో తండ్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని ఎల్వత్ గ్రామానికి చెందిన జాదవ్ పాండురంగ్ (40)కు ఐదుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. గతేడాది ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశారు. రూ.8 లక్షల వరకు అప్పు అయింది. మరో కుమార్తె వివాహానికి డబ్బులు లేవు. చేసిన అప్పులు ఎలా తీర్చాలనే బాధపడేవాడు. ఈక్రమంలో తాగుడికి బానిసయ్యాడు. గురువారం రాత్రి మద్యం మత్తులో ఇంటివెనుకల ఉన్న చెట్టుకు ఉరేసుకున్నాడు. కుటుంబీకులు, గ్రామస్తులు గమనించి అతన్ని ధర్మాబాద్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. భార్య సక్కుబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి..



వెంకటేశ్ (ఫైల్)

ఖానాపూర్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాహుల్‌గైక్వాడ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని బీర్సంది గ్రామంలో గల రాజీవ్ తండాకు చెందిన బానావత్ వెంకటేశ్ (27) హైదరాబాద్‌లో కూలీ పనిచేస్తూ ఉంటున్నాడు. శివరాత్రి సందర్భంగా నాలుగు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఈక్రమంలో భార్య మీనాక్షితో పలు విషయాలపై గొడవ జరిగింది. దీంతో ఆమె తల్లిగారిల్లు అయిన కొమ్ముతండాకు వెళ్లింది. గురువారం భార్యను తీసుకువచ్చేందుకు వెంకటేశ్ అక్కడికి వెళ్లాడు. మామ బూక్య మణిరాం తిట్టడంతోపాటు బీరుసీసాతో వెంకటేశ్ తలపై కొట్టాడు. అవమానంగా భావించిన ఆయన అదేరోజు రాత్రి ఇంటికి వచ్చాడు. జీవితంపై విరక్తితో దూలానికి ఉరేసుకున్నాడు. శుక్రవారం ఉదయం బయటకు రాకపోవడంతో కుటుంబీకులు వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. తండ్రి లచ్చునాయక్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆలయంలో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మారమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ కథనం ప్రకారం.. పూజారి రాత్రి 9 గంటల సమయంలో ఆలయం మూసివేసి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఆలయం తెరిచి చూసేసరికి హుండీ పగులగొట్టి ఉంది. అందులో రూ.20వేల నగదుతోపాటు మూడు గ్రాములు ఉన్న అమ్మవారి రెండు పుస్తెల తాళ్లు, తులం వెండి ముక్కుపుడక అపహరణకు గురైంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి హత్యాయత్నంపై నలుగురిపై కేసు

బెల్లంపల్లిరూరల్: యువకుడిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన నలుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్.రమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..కన్నెపల్లి మండలం చర్లపల్లికి చెందిన దుర్గం మహేందర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి పంచాయతీ పరిధి చర్లపల్లిలో యజమాని ఇంటి వద్ద గురువారం రాత్రి వాహనాన్ని ఉంచడానికి వెళ్లాడు. ఈక్రమంలో మహేందర్ రోడ్డుపక్కన కంకులు అమ్ముకునేందుకు గుడిసె వేసే ప్రయత్నం చేశాడు. బెల్లంపల్లి మండలం చర్లపల్లికి చెందిన దుర్గం సాయి, దుర్గం సన్నీ, కోట బానేష్, మరో ఒకరు అక్కడి చేరుకుని అతనితో గొడవపడి దాడి చేశారు. మహేందర్ బొలెరో వాహనాన్ని తీసుకుని వెళ్తుండగా మరోమారు అడ్డుకుని దాడికి పాల్పడ్డారు. దుర్గం సన్నీ ఇంట్లో నుంచి కత్తి తీసుకువచ్చి మహేందర్ పొట్ట, ఛాతీ భాగంలో పొడిచి పరారీ అయ్యారు. తీవ్రగాయాలతో కిందపడిన ఆయన తల్లిదండ్రులు దుర్గం యశోద, పోషంలకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. వారికి అక్కడికి చేరుకుని మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట ఆడుతున్న నలుగురి అరెస్టు

జన్నారం: మండలంలోని రేండ్లగూడ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని శుక్రవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు ఎస్సై రాజ వర్ధన్ తెలిపారు. పక్కా సమాచారంతోనే వారిని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ. 1600 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

వాగులో పడి ఒకరి మృతి

భైంసారూరల్: వాగులో ప్రమాదవశాత్తు పడి ఒకరు మృతిచెందినట్లు ఏఎస్సై లక్ష్మణ్ తెలిపారు. మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన కాసర్ల భూమన్న(54) శుక్రవారం మేకలను తీసుకుని గ్రామ సమీపంలోకి మేపేందుకు వెళ్లాడు. మేకలు నీటిని తాగేందుకు సుద్దవాగులోకి వెళ్లాయి. ఆ ప్రాంతంలో నీరు ఎక్కువగా ఉంది. ఒక మేక నీటిలో మునిగింది. గమనించిన భూమన్న నీటిలో దిగి కాపాడబోయి మునిగిపోయాడు. పక్కనున్న వారు గమనిస్తున్నలోపే పూర్తిగా నీటిలో మునిగి మృతిచెందాడు. కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

నాలాలో పడి వ్యక్తి..

భైంసాటౌన్: పట్టణంలోని సుభాష్‌నగర్‌లో నాలాలో పడి వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు..గోపాల్‌నగర్‌కు చెందిన సింధే శివాజీ(50) స్థానికంగా లేబర్ పనిచేస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం సుభాష్‌నగర్‌లోని డ్రెయినేజీపై కూర్చుని మద్యం తాగుతుండగా అదుపుతప్పి నాలాలో పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

బస్సును ఢీకొన్న మరో బస్సు

- ఇద్దరికి తీవ్ర, ఎన్నికల సిబ్బందికి స్వల్ప గాయాలు
- బస్సులు నిర్మల్, భైంసా డిపోలకు చెందినవి

గంగాధర: ఆర్టీసీకి చెందిన ఓ బస్సును మరో బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర, ఎన్నికల సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లాలో గురువారం నిర్వహించిన పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్సులను సిబ్బంది భైంసా, నిర్మల్ డిపోలకు చెందిన రెండు బస్సుల్లో కరీంనగర్‌లోని స్ట్రాంగ్‌రూంకు తరలించారు. శుక్రవారం తెల్లవారుజామున తిరిగి వెళ్తున్నారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నమిలికొండ, కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మంగపేట సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద స్పీడ్ బ్రేకర్ కారణంగా ముందు వెళ్తున్న నిర్మల్ డిపో బస్సు వేగం తగ్గింది. దీంతో వెనుక వస్తున్న భైంసా డిపో బస్సు దాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భైంసా డిపో బస్సు డ్రైవర్ మొయినొద్దీన్ కాలు విరగగా, పురుషోత్తం అనే వ్యక్తి ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఎన్నికల సిబ్బంది ప్రణయ్, ప్రియాంక, గంగాధర్, ముత్తన్న, రాజలింగం, స్వరూప, సూరజ్‌కుమార్, ప్రసిల్లా, ఎస్కే రఫీ, ఎస్కే అజీజ్, విక్రమ్, పృథ్వీ, ఎస్.అశోక్, పి.అభిలాష్, ఎ.రవి, సి.విక్రమ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. రైల్వే గేట్‌మ్యాన్ ప్రదీప్ సమాచారంతో కొడిమ్యాల పోలీసులు, గంగాధర బ్లూకోల్ట్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను ఆస్పత్రికి తరలించారు.



డ్రైవర్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

నెన్నెల: విధులు ముగించుకుని బైక్‌పై వెళ్తుండగా శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై ప్రసాద్ కథనం ప్రకారం.. నెన్నెల పోలీసుస్టేషన్‌లో బాగాల సంతోష్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని బైక్‌పై నెన్నెల నుంచి తన సొంతూరు ఎల్లారం వైపు వెళ్తున్నాడు. బొప్పారం సమీపంలోని నర్సరీ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో కుడి కాలు విరిగింది. తలకు, ముఖానికి తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలో రోడ్డుపై పడిపోయాడు. అటు వైపు వెళ్లే ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఘటనాస్థలికి చేరుకుని అతన్ని 108లో మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జనరల్ మజ్దూర్లు ఇక జనరల్ అసిస్టెంట్లు

- ఉత్తర్వులు విడుదల

శ్రీరాంపూర్: బొగ్గు పరిశ్రమల్లో జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్‌ను జనరల్ అసిస్టెంట్‌గా మారుస్తూ కోలిండియా యజమాన్యం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్ పేరు హుందాగా లేదని, దీన్ని మార్చాలని చాలా కాలంగా కార్మికులు, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. జేబీసీసీఐ స్టాండడైజేషన్ కమిటీలో డిమాండ్ చేశారు. ఎట్టకేలకు మారుస్తూ యజమాన్యం ఉత్తర్వులు విడుదల చేయడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది తమ పోరాట ఫలితమని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు.

రిటైర్డ్ కార్మికులకు పెరిగిన పెన్షన్ చెల్లించాలి

పాతమంచిర్యాల: సింగరేణి రిటైర్డ్ కార్మికులకు 11వ వేజ్‌బోర్డు కాలపరిమితిలో పెరిగిన పెన్షన్ చెల్లించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో గురువారం సంస్థ సీఎండీకి పంపించే బహిరంగ లేఖను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11వ వేజ్ బోర్డులో పదవీ విరమణ పొందిన కార్మికులకు 44 నెలల పెరిగిన పెన్షన్ ఏరియర్లు వెంటనే చెల్లించాలన్నారు. వితంతు పెన్షన్లు మంజూరు చేయాలని, మారుపేర్లను సరిచేయాలని, మెడికల్ కార్డుపై అధికారులకు చెల్లిస్తున్నట్లుగా రూ.25 లక్షలు వైద్యం కోసం అందించాలన్నారు. సొంతిల్లు లేని కార్మికులకు 200 గజాల స్థలం ఇవ్వాలన్నారు. నాయకులు వెంకటయ్య, జ్ఞానీ, రాజేశం, లక్ష్మణ్, చంద్రయ్య, రాంరెడ్డి, రాజయ్య, రామస్వామి పాల్గొన్నారు.



లేఖ చూపుతున్న రిటైర్డ్ కార్మికులు

స్వగ్రామానికి చేరిన వలసజీవి మృతదేహం

సారంగపూర్: దుబాయిలో గతనెల 16న ఉరేసుకున్న వలసజీవి మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన షేక్ అన్సార్ (34) ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం దుబాయి వెళ్లాడు. అక్కడ ఫూజైరా దిబ్బా మున్సిపల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చి వెళ్లాడు. గతనెల 16న కంపెనీ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని తోటి కార్మికులు కుటుంబీకులకు ఫోన్‌లో సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని కుటుంబ సభ్యులు ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పరికిపండ్ల స్వదేశ్‌ను కోరారు. దీంతో ఆయన ఇండియన్ ఎంబసీ కార్యాలయానికి మెయిల్ ద్వారా సమాచారం చేరవేయడంతోపాటు అక్కడే దుబాయిలో ఉన్న సామాజిక కార్యకర్త గుండెల్లి నర్సింహాకు విషయం తెలిపాడు. వీరిద్దరి సమన్వయం, రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మృతదేహం హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. అక్కడి నుంచి అంబులెన్స్‌లో శుక్రవారం స్వగ్రామానికి తరలించగా, అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, కూతురు(8), కుమారుడు (6) ఉన్నారు.